క్లుప్తంగా

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు నేడు కమిటీ సమావేశం

బొంరాస్‌పేట: మండల కేంద్రంలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు స్వేరో సర్కిల్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. అలాగే మిగిలిన గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఈమేరకు శనివారం జెడ్పీహెచ్ఎస్ మైదానంలో స్థానిక అంబేడ్కర్ సంఘంతోపాటు, వివిధ సంఘాల నాయకులు సమావేశం కానున్నట్లు తెలిపారు. నెలాఖరులోగా మండల కేంద్రంలో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోండి

బొంరాస్‌పేట: పట్టా భూమి ఉన్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం జీవితబీమా కల్పిస్తోంది. అందుకు ఈ ఏడాది రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని రైతుసంఘం మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 10 నుంచి రైతుబీమా పథకం ప్రారంభం కానుందని తెలిపారు. రైతు బీమాకు 18 నుంచి 59 ఏళ్ల వయస్సు ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి పట్టా పాసుపుస్తకం, ఆధార్ కార్డు, నామినీ ఆధార్‌కార్డు, దరఖాస్తు ఫారంతో స్వయంగా దరఖాస్తుదారుడే రావాలని సూచించారు.

గురుకులానికి విద్యార్థిని ఎంపిక


శ్రీకావన్య

కొడంగల్ రూరల్ : పాతకొడంగల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థి శ్రీకావన్య గురుకుల పాఠశాలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం క్రాంతికుమార్ తెలిపారు. బషీరాబాద్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి చదివేందుకు విద్యార్థి ఎంపికయ్యిందని అన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు సంధ్య, ఎస్‌ఎంసీ చైర్మన్ ఆంజనేయులు హర్షం వ్యక్తం చేశారు.

సీఐగా శివలింగం బాధ్యతల స్వీకరణ


సీఐకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్‌ఐ విఠల్‌రెడ్డి

మోమిన్‌పేట: సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా శివలింగం శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేసిన సీఐ వెంకటేశం బదిలీ కాగా ఆయన స్థానంలో శివలింగం వచ్చారు. సంగారెడ్డి రూరల్ సీఐగా ఈయన విధులు నిర్వహించారు. శివలింగం మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కల్గించే ఎంతటి వారినైనా విడిచిపెట్టేది లేదన్నారు. ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. అంతకు ముందు ఎస్‌ఐ విఠల్‌రెడ్డి సీఐని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

భక్తిశ్రద్ధలతో చాతుర్మాస పూజలు


భజన కార్యక్రమంలో ఆధ్యాత్మిక సేవా సమితి సభ్యులు

కొడంగల్ రూరల్ : పట్టణంలోని ఆధ్యాత్మిక, ధార్మిక సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం రాత్రి భక్తిశ్రద్ధలతో చాతుర్మాస పూజలు నిర్వహించారు. బాలాజీనగర్‌లోని నాయికోటి మల్లయ్య నివాసంలో పార్వతీపరమేశ్వరుల చిత్రపటాలకు ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. ఆషాఢ శుద్ధ ఏకాదశి వరకు ప్రతీ గురువారం రాత్రి 8 గంటల నుంచి 12గంటల వరకు భగవద్గీత పారాయణం, హనుమాన్ చాలీసా, దైవ ప్రార్థనలతో దేవదేవున్ని వేడుకున్నారు. ఈ సందర్భంగా ధార్మిక సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ హీరాలాల్ మాట్లాడుతూ ఆధ్యాత్మికతతో మనసు ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటుందన్నారు. ధర్మాన్ని పాటిస్తూ దైవ చింతనను అలవర్చుకోవాలన్నారు. పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ కమిషనర్


జాకీర్ అహ్మద్

వికారాబాద్ అర్బన్: మున్సిపల్ కమిషనర్‌గా జాకీర్ అహ్మద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రెండేళ్లపాటు ఇక్కడ కమిషనర్‌గా పనిచేసిన శరత్ చంద్ర బదిలీపై వెళ్లడంతో కల్వకుర్తి కమిషనర్‌గా పనిచేసిన జాకీర్ అహ్మద్ బదిలీపై ఇక్కడకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయా విభాగాల అధికారులు, సిబ్బందితో ఆయన సమావేశమై మున్సిపల్ పూర్తి సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు.

చిగురిస్తున్న ఆశలు


ధారూరు సమీపంలో సాగుచేసిన పత్తి పంట

- వర్షాలతో పంటలన్నీ కళకళ
- భారీగా పెట్టుబడులు పెట్టిన రైతన్నలు

ధారూరు: కురుస్తున్న వర్షాలతో పంటలు ఊపిరి పోసుకున్నాయి. మండలంలో పత్తి పంటనే అధికంగా సాగుచేస్తున్నారు. ఎకరాకు దాదాపు రూ.20 వేల వరకు పెట్టుబడి పెడుతున్నారు. మండలంలో పత్తితో పాటు కంది, మొక్కజొన్న, పెసర, మినుము, సోయాబిన్, నువ్వులు తదితర పంటలను సుమారు 28 వేల ఎకరాల్లో సాగుచేస్తున్నారు. రూ.వందల కోట్ల పెట్టుబడులతో సాగు చేసిన పంటలకు వరుణుడు సైతం కరుణిస్తున్నాడు. ప్రస్తుతం అన్ని రకాల పంటలు మొలకెత్తాయి. అడపా, దడపా వానలు కురుస్తూనే ఉన్నాయి. మొక్కల మనుగడకు ఈ వాన ఉపకరిస్తుందని రైతులు చెబుతున్నారు. పొలాలన్నీ పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. ఈసారి డీఏపీ ఎరువును అధికంగా వాడారు. వానలు సకాలంలో కురువక పంటల సాగు ఆలస్యంగా జరిగిందని, విత్తిన తర్వాత వానలు ఆదుకోవడంతో పెట్టుబడులు చేతికి వస్తాయనే నమ్మకం కల్గిందని వారు పేర్కొన్నారు. వ్యవసాయశాఖ ద్వారా సరఫరా చేస్తున్న పీఆర్‌జీ 176 రకం కంది విత్తనాలు రైతులను శుక్రవారం కూడా తీసుకెళ్లారు. శనివారం నుంచి వీటిని విత్తనున్నట్లు రైతులు తెలిపారు.

బ్లాక్ మార్కెట్‌కు కంది విత్తనాలు

పీఆర్‌జీ 176 రకం కంది విత్తనాలలను ఒక్కో రైతుకు 4 నుంచి 16 కిలోల చొప్పున 21.50 క్వింటాళ్లు, ఎల్ఆర్‌జీ 52 రకం కంది 5 క్వింటాళ్ల విత్తనాలను పంపిణీ చేశారు. వీరిలో 80 శాతం మంది రైతులు సాగుచేయకుండా బహిరంగ మార్కెట్లో అమ్ముకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాస్తవంగా పీఆర్‌జీ 176, ఎల్ఆర్‌జీ 52 రకం కంది విత్తనాలను డెమాన్‌స్ట్రేషన్ షీడ్ కింద ఇచ్చి ప్రయోగాత్మకంగా సాగుచేయించాలి. సాగు చేసిన రైతుల వివరాలను నమోదు చేసుకుని దిగుబడి ఎంత వచ్చిందనే గణాంకాలను సేకరించి ఉన్నతాధికారులకు పంపించాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వ వ్యవసాయశాఖ అధికారులు ఈ విత్తనాలను తీసుకెళి సాగుచేసిన పంటలను పరిశీలించాల్సి ఉంటుంది. క్షేత్రస్థాయిలో పరిశీలించి విత్తనాలు తీసుకెళ్లిన రైతులు సాగుచేశారా అన్నది తేల్చాల్సి ఉందని రైతు సంఘాలు పేర్కొన్నాయి.

చెరువులకు జలకళ


దౌల్తాబాద్ చెరువులో నిండుగా నీరు

కొడంగల్ : నియోజకవర్గంలోని నోటీఫైడ్ చెరువులు.. కుంటలు వర్షం నీటితో జలకళను సంతరించుకున్నాయి. కొడంగల్ పెద్ద చెరువు, హస్నాబాద్ చెరువు, పెద్ద నందిగామ, పర్సాపూర్, అంగడిరాయిచూర్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట చెరువులతో పాటు కాకరవాణి ప్రాజెక్టులో వరద నీరు చేరింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షం నీరు పాటు కాలువల ద్వారా చెరువుల్లోకి చేరుతోంది. రైతులు పొలాల్లో విత్తనాలు వేస్తున్నారు. వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్నాయి.

దశలవారీగా సమస్యల పరిష్కారం


వార్డులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ఆనంద్

ఎమ్మెల్యే ఆనంద్

అనంతగిరి: కాలనీలలోని సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే ఆనంద్ అన్నారు. శుక్రవారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని 24, 25, 33, 34 వార్డుల్లో ఎమ్మెల్యే 'మీతో నేను' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వార్డుల్లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాడైపోయిన మ్యాన్‌హోల్స్ బాగు చేసి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా చూడాలని కోరారు. కాలనీలలో ఓపెన్ ప్లాట్‌లలో పిచ్చిమొక్కలు పెరగకుండా చూడాలని, ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేస్తూ ఉండాలన్నారు. వార్డులలో పాత స్తంభాలు తొలగించి అవసరమైన చోట కొత్త స్తంభాలను ఏర్పాటు చేయాలని కోరారు. పాడైపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను షిఫ్టింగ్ చేయాలని, పాడైపోయిన వాటిని వెంటనే రిపేర్ చేయాలన్నారు. కాలనీలలో రోడ్లు తదితర అభివృద్ధి పనులకు కృషి చేస్తామన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ


నోటుపుస్తకాలతో విద్యార్థులు

ధారూరు: మండల పరిధిలోని మోమిన్‌ఖుర్దు గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి జనార్దన్ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. శుక్రవారం విద్యార్థులందరికీ ఉపాధ్యాయులతో కలిసి అందజేయగా తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, హెచ్‌ఎం శ్రీనివాస్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయాలి


మాట్లాడుతున్న ఎంపీపీ

ప్రాధాన్యతల వారీగా సమస్యల పరిష్కారం

- అధికారులకు ఎంపీపీ చంద్రకళ ఆదేశం

అనంతగిరి: అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ చంద్రకళ అన్నారు. ఈ మేరకు శుక్రవారం వికారాబాద్ మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు సభ్యులు సమస్యలపై నిలదీశారు. గ్రామాల్లో ఇంకా పలు చోట్ల విద్యుత్ సమస్యలు ఉన్నాయని వెంటనే పరిశీలించాలని అధికారులను కోరారు. కొన్ని గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా మారాయని, దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే మరమ్మతు చేయాలన్నారు. సర్పన్‌పల్లి ప్రాజెక్టు వద్ద ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, వెంటనే చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ గోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయా శాఖల నివేదికలు, అందిస్తున్న సేవలు, పథకాలను వివరించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న సమస్యలను ప్రాధాన్యతను బట్టి పరిష్కరించాలని కోరారు. మండల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. సమావేశంలో ఎంపీడీఓ సత్తయ్య, పీఆర్ డీఈ మాధవరెడ్డి, తహసీల్దార్ రాజేందర్‌రెడ్డి, ఎంపీవో నాగరాజు, ఎంఈఓ బాబుసింగ్, వైస్ ఎంపీపీ రాములు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం


పరిగి: సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్


పెద్దేముల్: ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పరిగి: వర్షాలు కురుస్తుండటంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిలర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వార్డుల్లో కౌన్సిలర్లు పర్యటించి సమస్యలు తెలుసుకోవాలని సూచించారు. వర్షం నీరు ఎప్పటికప్పుడు పారేలా మురుగు కాలువలను శుభ్రం చేయించాలన్నారు. కాలనీలో ప్రజా సమలస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామన్నారు. ఖాళీ ప్లాట్లల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనల్ శ్రీనివాసన్, కౌన్సిలర్లు రవీందర్, ఎదిరే కృష్ణ, నాగేశ్వర్,వెంకటేష్, రవికుమార్ పాల్గొన్నారు.

ప్రజలకు అవగాహన

పెద్దేముల్: ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే సీజన్ వ్యాధుల బారిన పడకుండా ఉంటామని ఎంపీ హెచ్ఏ హరిశంకర్ అన్నారు. శుక్రవారం పలు వార్డుల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన తెలియచేశారు. ఇళ్ల వద్ద నీరు నిల్వ ఉండకుండా చూడాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తాగునీరును వేడి చేసి తాగాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం వెంకటమ్మ, ఆశ వర్కర్‌లు పాల్గొన్నారు.

ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తాం

- ఆసరా పెన్షన్ నెలకు రూ.4 వేలు అందిస్తాం
- మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్


కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్

మర్పల్లి: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు నెలకు రూ.4 వేలు ఆసరా పెన్షన్ ఇస్తామని మాజీమంత్రి గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు. పంచలింగాల, తిమ్మాపూర్, మర్పల్లి గ్రామాలకు చెందిన బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఏకకాలంలో రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని తెలిపారు. సీఎం కేసీఆర్ ఎన్నికల సమయంలో 100కు పైగా హామీలు ఇచ్చారని అందులో మూడు హామీలను మాత్రం అమలు చేశారని ఆరోపించారు. హామీలు నెరవేర్చని బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్ సాగర్, జిల్లా నాయకులు శంకరయ్యగౌడ్, ఖలీమోద్దీన్, సంజీవరెడ్డి, గొల్ల రాములు, నాగేశ్, శేఖర్‌గుప్తా, రఫీ, రాచన్న, సురేష్, మర్రి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కో ఆర్డినేటర్‌గా సూరజ్ సింగ్


కో ఆర్డినేటర్‌గా నియామక పత్రాన్ని అందుకుంటున్న సూరజ్ సింగ్

తాండూరు టౌన్: తెలుగుదేశం పార్టీ తాండూరు నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా పట్టణానికి చెందిన సూరజ్ సింగ్ ఠాకూర్ నియామకయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సూరజ్‌సింగ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో టీడీపీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందుకు తీసుకెళ్తానని, అలాగే నియోజకవర్గంలో పార్టీకి పునర్ వైభవం తీసుకువస్తానన్నారు.

12న మండల సమావేశం

బంట్వారం: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 12న నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ ప్రభాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం ప్రారంభమవుతుందని చెప్పారు. ప్రజా ప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు.

సీఐ శంకర్ బదిలీ



కొడంగల్ : సీఐ శంకర్ బదిలీ అయ్యారు. సెకండ్ మల్టీ జోన్ ఐజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. సీఐ శంకర్ ఏడాది క్రితం కొడంగల్ సీఐగా విధుల్లో చేరారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఆయనకు స్థాన చలనం కలిగినట్లు అధికారిక వర్గాల ద్వారా తెలుస్తోంది. ఐజీ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న రాములును కొడంగల్ సీఐగా నియమించారు.

ఆహ్వాన పత్రిక అందజేత


ఆహ్వాన పత్రికను అందిస్తున్న సంఘం నాయకులు

కొడంగల్ : పెద్దమ్మ తల్లి ఫలహారం బండి (రథోత్సవం) ఆహ్వాన పత్రికను ముదిరాజ్ మహాసభ నాయకులు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎనుముల తిరుపతిరెడ్డికి అందజేశారు. ఈనెల 16న మధ్యాహ్నం రెండు గంటలకు పట్టణంలోని ముదిరాజ్ భవన్ నుంచి ఊరేగింపు ప్రారంభం అవుతుందని ముదిరాజ్ మహాసభ ప్రతినిధులు తెలిపారు. ముఖ్య అతిథిగా టీపీసీసీ అధ్యక్షుడు ఎనుముల రేవంత్‌రెడ్డి వస్తున్నట్లు ఆహ్వాన పత్రికలో ముద్రించారు. ఈ మేరకు ముదిరాజ్ మహాసభ ప్రతినిధులు కొడంగల్‌లోని రేవంత్ నివాసానికి వెళ్లి ఆయన సోదరుడు కొడంగల్ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేసి రథోత్సవంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు నందారం ప్రశాంత్, ప్రచార కార్యదర్శి సోమశేఖర్, న్యాయవాది వెంకటయ్య, ముదిరాజ్ సంఘం నాయకులు బాల్‌రాజ్, నరేష్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు


డీటీ వీరేష్ బాబును సన్మానిస్తున్న తహసీల్దార్ వెంకటస్వామి, సిబ్బంది

బషీరాబాద్: అధికారులు అంకిత భావంతో పని చేస్తే ప్రజల్లో మంచి గుర్తింపు వస్తుందని తహసీల్దార్ వెంకటస్వామి అన్నారు. డీటీగా పనిచేసి వికారాబాద్‌కు బదిలీపై వెళ్లిన వీరేష్ బాబు వీడ్కోలు సమావేశం శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ వీరేష్ బాబు సేవలను కొనియాడారు. నిరంతరం కార్యాలయానికి వచ్చే రైతులు, పేదలు, విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు పరిష్కరించి పంపేవారని అన్నారు. వీరేస్ బాబు మాట్లాడుతూ మండల ప్రజలు చాలా మర్యాదగల వారని అన్నారు. ఈ ప్రాంతాన్ని తన జీవితంలో మరిచిపోలేనని అన్నారు. అనంతరం కార్యాలయ సిబ్బంది, విలేకరులు డీటీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ వెంకటేష్, ఆర్ఐ రాకేస్, సర్వేయర్ ప్రభుకుమార్, కంప్యూటర్ ఆపరేటర్ అరుణ్‌కుమార్ తదతరులు పాల్గొన్నారు.

సమస్యలపై నిరంతర పోరాటం


పరిగి: జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు


తాండూరు టౌన్: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవంలో నాయకులు

- ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రమేశ్
- ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవం

పరిగి: ప్రజా సమస్యలపై ఎమ్మార్పీఎస్ నిరంతరం పోరాటం చేస్తోందని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రమేశ్ అన్నారు. ఎమ్మార్పీఎస్ 29వ ఆవిర్భవ దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బహుజనుల అభ్యున్నతికి మందకృష్ణమాదిగా ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఆయన స్ఫూర్తితో పోరాటం మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు సాలేటి వెంకటేష్, శ్రీను, రహీం, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తాండూరు పట్టణంలో..

తాండూరు టౌన్: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శుక్రవారం తాండూరులో ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ చౌక్‌లో దివంగత ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరించి, కేకు కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ కె మల్లికార్జున్ మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం చేస్తూనే ఉన్నామని, మాట తప్పిన రాజకీయ పార్టీలకు రాబోయే ఎన్నికల్లో గట్టి గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహులు, స్వామిదాస్, కృష్ణ, సువర్ణ, ప్రకాష్, వెంకట్, అజయ్, ఎంఎస్ఎఫ్, ఎంఎస్పీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో జెండా పండుగ

పెద్దేముల్: మండలంలోని జనగాంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఇన్‌చార్జి స్వామిదాస్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా పండుగ నిర్వహిస్తామన్నారు. వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో ఎంతో మార్పు తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో రాజు, దేవప్ప, చెన్నప్ప, బాలప్ప, శ్రీనివాస్, రమేశ్, దస్తప్ప, వెంకటేశ్, ఆశోక్, రాజుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించండి


సమ్మెలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య

దౌల్తాబాద్: పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధన కోసం పంచాయతీ కార్మికులు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చేస్తున్న నిరవధిక సమ్మెకు సీఐటీయూ మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీస వేతనం 19,500 పెంచాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు కుర్మని సాయిలు, తదితరులు పాల్గొన్నారు.